

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

# వర్కింగ్ ఫర్ హోము విలాపము

" తొమ్మిదింటికల్లా పిల్లని రెడీ చేసి స్కూల్లో దింపండి"

" .......ఊ... "

" వంటింటి తిన్నె మీద గిన్నెలో మావిడికాయ పప్పు చేసా. తినేముందు పోపేసుకోండి.."

" ........ఊ......."

" ఆ దిక్కుమాల్న వెల్లుల్లిపాయలు వేసుకోకండి..వేడి"

" ఊ.....ఊ..."

" ఫ్రిజ్జిలో నిన్నటి వంకాయ కూరుంది. వేడి చేసుకోండి.."

" ....ఊ...ఊఊ.. "

" పన్నెండిటికి వేడిగా ఓ గ్లాసు బియ్యం పడేసుకోండి.."

" ఊ..గుర్.."

" నే వెళ్ళొస్తా"

"గుర్ర్ర్....గుర్ర్ర్ర్..."

ఆవిడ వెళ్ళిన రెండంటే రెండే నిముషాలకి "కరాగ్రే వసతే" చెప్పుకుంటూ, కళ్ళు నులుపుకుంటూ లేచి టైము చూసా. ఒకటే ముల్లు కనిపించింది తొమ్మిది మీద. రెండోదేదీ ? అది కూడా ఆఫీసు కెళిపోయిందా ? మరి ఈ ముల్లు మిగిలిపోయిందేం ? ఇది కూడా నాలాగే వర్కింగ్ ఫ్రం హోమా ? ఇలా కాదని, ఈసారి కాస్త జాగ్రత్తగా వళ్ళు విరుచుకుని, కళ్ళు నులుపుకుని, మళ్ళీ చూసా. ఈసారి ముచ్చటగా మూడు ముళ్ళూ కనబడ్డాయి సెకన్ల ముల్లుతో సహా. అన్నీ తొమ్మిది మీదే వున్నాయి. బాబా రాందేవ్ గారు వేసిన

పశ్చిమోత్తానాసనంలా వున్నాయి. అంటే..వార్నాయనోయ్..పావుతక్కూ తొమ్మిదే !! మరదేంటీ, మా ఆవిడ పావు తక్కువ ఏడుకే ఆఫీసుకెళ్తుందే. పాపం, పిచ్చి మొహంది, ఇవాళ దానికి తెలివొచ్చుండదు పొద్దున్నే. ఇంతలో ఫోను మోగింది. ఎత్తాను.

"ఏవిటీ, ఇవాళ లేటా?" అడిగాను ఉత్సాహంగా.

"లేటేవిటీ? నేనొచ్చి గెంటన్నరైంది. మీరు దాన్ని స్కూల్లో దింపారో లేదో నని చేస్తున్నా"

"అదా...అదీ..అంటే..ఇప్పుడు దానికి షూ తొడుగుతున్నానన్నమాట. దాన్ని దింపేసొచ్చి, ఆనక ఫోను చేస్తా". ఠపీమని కట్‌చేసి పెట్టేసా. పక్కకి తిరిగి చూసా. తలగడా మీద రెండు కాళ్ళు కనబడ్డాయి దుప్పట్లోంచి. వళ్ళుమండి, దుప్పటీ లాగేసా. ఈ ఇహలోకంతో సంబంధం లేనట్టు బేఖాతరుగా పడుక్కుని నిద్దరోతోంది నా నాలుగేళ్ళ స్లీపింగ్ బ్యూటీ. అయినా దాన్ననియేంలాభం. తండ్రినిపోలింది. దాన్ని కుదిపి, కితకితలెట్టి, పళ్ళు తోవి, పాలుపట్టేసరికి, పెద్దముల్లూ, చిన్నముల్లూ కాళ్ళు బార జాపుకుని పడక్కుర్చీలో పడుక్కున్నాయి, బాబోయ్...తొమ్మిదింపావు..

"ఒసేయ్...నువ్వాగవే, సెకన్ల ముల్లులా ఇల్లంతా అలా పరిగెట్టకే. పైకి పద, బొొబ్బ పోసుకుందాం.."

"వద్దునాన్నా, ఇప్పుడు ప్లే టైము. ఓకే. ఐ.స్టార్ట్. నూకలిస్తా, మేకలు కాస్తావా ? "

"నువ్విలాగే లేటు చేస్తే, మాబాసు గాడు ఓ మంచిరోజు చూసి ఉజ్జోగం పీకేస్తాడు. అప్పుడు
మేకలు కాదు, గేదెలు కాసుకోవాలి, నువ్వు రావే, రాక్షసీ.." అంటూ దాన్ని చాప చుట్టలా ఎత్తుకుని, పైకి తీసుకెళ్ళి రెడీ చేసి, షూ తొడిగేసా. "నాన్నా పిలక కట్టు" ఆర్డరేసింది. ఏదో నాకొచ్చిన విధంగా జుట్టంతా ఓ పిడికిట్లో పట్టుకుని, ఎగాదిగా దువ్వేసి, ఓ రబ్బరు బేండేసా.
అది అప్పుడే సీలేరు అడవుల్లోంచి తప్పిపోయొచ్చిన చెంచితలా వుంది. దేవుడు మేలుచేసి దానికలాగే నచ్చిందంది. మారు మాట్టాడకుండా వెళ్ళి, దాన్ని స్కూల్లో దింపేసి గబుక్కునొచ్చేసా ఇంటికి. అప్పటికి టైటాను వాచీ వాడి టైమయ్యింది విక్టరీ సింబల్ చూపిస్తూ. అప్పుడు....

*బాసు గాడి తృప్తికోసం కాస్త పనిచేసి పెడదావని బేస్ మెంటులో ఆఫీసు రూము కెళ్ళాను*
*ప్రభూ ! మా పిల్లశ్రీ ఆడి పారేసిన బంతులతో, బ్లాకులతో ఆఫీసువనం కంగాళీగా ఉంది. అప్పుడు..*

*నేనొక లాపుటాపు కడ నిల్చి, చివారన స్విచ్చి నొక్కి,*
*లాగిన్నగునంతలోన..*
*మా ఆవిడ ఫోను చేసి "ఆ..ఆ..గిన్నెలు తోవుమా" యనగ*
*బావురుమంటిని, కృంగిపోతి..*
*నా మానసమందెదో కలుకు మన్నది టెలీకమ్యూటు కావ్యమై...*

*ఆ..ఆ..ఆ..ఆ ( వద్దులెండి, వచ్చేసారి బాగా ప్రాక్టీసు చేసి, ఆనక వాదుల్తాను, దాన్తస్పాదియ్యా...)*

*ఇంతలో..ఒక ఈ మెయిలు కన్నియ సన్నని గొంతుకతో ఇలా అన్నది ప్రభూ.*

*" పని చేసెడి నాల్గు గడియల్*
*పనికిమాలిన వెబ్ సైటులు చూసి చచ్చెదవు ,*
*మదీయ మొహమ్ముజూసి, ఓపెను జేసి, పనిచేయుము ,*
*మీ బాసుకు తెల్పినంతనే,*
*హాయిగ పీకివేయు నిను, ఎల్లరు సంతసించగా..*

*ఆ...ఆ..ఆ..ఆ ( ఏంటా నవ్వు? పైన చెప్పాగా, రాగాల్లో కొంచెం వీకని. హన్నా..తప్పదీ..)*

సరే, వంటింట్లో కొచ్చి గిన్నెలుతోవుతూ మా బాసుగాడికి ఫోను చేసా, ఉజ్జోగం వుంచాడో, ముంచాడో కనుక్కోడానికి. పాపం వాడు మంచాడు, పిల్లలుగలవాడు. నా ప్రతిభమీద ఇంకా ఎక్కడో ఓ మూల వెట్టినమ్మకవూ, భ్రమా వున్నాయి కాస్త. అందుకే " ఈ వారం పనంతా సాయంత్రంలోపల చేసేసి రిపోర్టు పంపించేస్తే, మిగితావి మండే చూసుకుందాం, నీకు ఆఫీసు డ్రైవింగులో రెండు గంటలు కలిసొచ్చింది కదా, అందుకని ఎంచక్కా నా ప్రెజెంటేషన్ చేసి పెట్టెయ్యాలన్నమాట..." అని పెట్టేసాడు, నేను ఔననీ, కాదనీ చెప్పేలోపే.

వంటిల్లు సద్ది పని మొదలెట్టా తప్పదని. మళ్ళా ఫోను మోగింది. ఎత్తి "ఆ కడిగేసాను శుభ్భరంగా.." అన్నాను. "వాట్..వుయ్ ర్ కాలింగ్ ఫ్రం జంక్ సర్వే కంపెనీ.." ఇంకేదో మాట్టాడుతోంది అవతలి గొంతు. "నో ఇంగ్లీస్. అమ్మా నాన్నా సినిమాకెళ్ళారు. నేను సిగరెట్టు తాగుతున్నాను. నువ్వు పెట్టెయ్ ఫోను.." అని స్విచ్చాఫ్ చేసా. దిక్కు మాలిన సర్వేలూ వీళ్ళూను. ప్రతీ దానికీ సర్వే. మొన్న గేస్ స్టేషన్లో మా రెస్టురూం వాడారు కదా, దానిమీద మీఅభిప్రాయం? హౌ డూ యూ రేట్ యువర్ రెస్టురూం ఎక్స్‌పీరియెన్స్, ఆన్ ఎ స్కేల్ ఆఫ్ వన్ టు టెన్ అనుకుంటూ. వళ్ళు మండదూ?

సరే, చెప్పకపోడవే, నిజంగానే కాసేపు మా ఆఫీసువాడికి పన్జేసిపెట్టా. ఇంతలో మావిడికాయ పప్పు గుర్తొచ్చింది. పైకొచ్చి, వెల్లుల్లిపాయల పోపేసి, అన్నం వండుకు తినేసరికి రెండు.

కిందకొచ్చి మళ్ళా "ఇన్ బాక్సెటు" గనుల్లోకెళ్ళి ఈమెయిలు తవ్వకాలు మొదలెట్టాను. వాటిల్లోంచి కొన్ని హెల్ప్‌డెస్క్ వజ్రాలూ, మీటింగ్ మినిట్సు ఖనిజాలూ వెలికితీసి, సానబట్టి, అచ్చుపోసి అవతల గిరాటెట్టేసరికి నాలుగైపోయింది. మళ్ళీ ఫోను మోగింది.

నేను ఫోనెత్తి వెంఠనే చెప్పేసా " అమ్మా, నాన్నా ఇంట్లో లేరు, నో ఇంగ్లీస్, నేను సిగరెట్ తాగుతున్నాను.".

"పీకి పిసుకుతాను, ఇంతకీ తిన్నారా? లేదా? ".

"ఓ, నువ్వా . తిన్నాను తిన్నాను, అదేవిటో ఇవాళ అసలు వెల్లుల్లిపాయలు వేడే చెయ్యలేదు తెలుసా?" అన్నాను భయం భయంగా.

"అఘోరించండి. నాకేం. అప్పడాలూ, వడియాలూ, మజ్జిగ మెరపకాయలూ కూడా వేయించుకోవలసింది. ఆ వెల్లి తిండే తగ్గించమన్నది. ఉన్నదే జానెడు పీక. అదికూడా పూర్తిగా పూడుకుపోయి, పెద్దకుండ మీద చిన్నకుండ బోర్లించినట్టు తయారవుతోంది పెర్సనాలిటీ. సర్లెండి. బేంకు కట్టేసేలోపు వెళ్ళి లాకర్లోంచి నా డైమండ్ నెక్లెస్సూ, పిల్ల రవ్వల గాజులూ తెండి, రేపు పార్టీ వుంది. అన్నట్టు కాస్త ఆ బీన్సూ, కేరెట్లూ తరిగి వుంచండి, నేనొచ్చి బిరియానీ చేస్తాను." ఫోను కట్టు.

ఇంక నేను తట్టుకోలేకపోయాను. "లక్షణంగా, అందరిలాగే ఆఫీసుకిపోతే, నాలుగింటికల్లా దొబ్బుకొచ్చేసేవాణ్ణి శుక్కురారం పేరుచెప్పి. కానీ ఇప్పుడు.. ఆఫీసు పని, ఇంటిపని. వంటపని, పిల్ల పని, బేంకు పని, బాసుగాడి పని, బిరియానీ పని, ఇలా ఎంతకని?"

*అని విలపిస్తూ.. ఏ పనీ చేయలేక వట్టిచేతులతో లాగ్ అవుట్ అయిపోయిన నా పని హృదయాన్ని అర్థం చేసుకుని, నాలాంటి వర్క్ ఫ్రం హోం గాళ్ళపై నీ కరుణశ్రీ రేఖలు ప్రసరించి, మాక్కాస్త రెస్పెక్టిప్పించు ప్రభూ...!*

*ప్రభూ....భూ..ఊ..ఊ ఊ..ఊ..ఊ ఊ (ఇది బానే వచ్చు..)*

